క్లుప్తంగా

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.68 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్ట పాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.8,597 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్‌జిఆర్. నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.80,460, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.30,010, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.37,127, ఇతర విరాళాలకింద రూ.21 వేలు వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల అంచనాకు పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల అంచనాకు నూతన విధానంలో అసెస్‌మెంటు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, కేజీబీవీ విద్యాలయాలలో జరుగుతున్న అసెస్‌మెంట్ పరీక్షలను సోమవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యేక బుక్‌లెట్‌లో ఒ.ఎం.ఆర్. విధానంలో పరీక్షలు నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. క్లస్టర్ హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం, కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్.రేష్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

కందుకూరు రూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం భోజన విరామం సమయంలో నిరసన వ్యక్తం చేశారు. బదిలీలు నిర్వహించాలని, గత ప్రభుత్వం ఎయిడెడ్ అధ్యాపకులని ప్రభుత్వ కళాశాలల్లో వినియమించిన జీఓ నంబర్ 42ను రద్దు చేయాలని, తమను దేశంలో 26 రాష్ట్రాల్లో ఉన్న విధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా రీడెజిగ్నేట్ చేయాలని డిమాండ్ చేశారు. అనేక మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యలను తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 18న విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో రాష్ట్ర వ్యాప్త మహా ధర్నా నిర్వహిస్తమని తెలిపారు.పి.రాజగోపాల్, ఎస్.తిరుపతిస్వామి, బి.కమలబాబు, ఎన్వీ.శ్రీహరి, ఏడుకొండల నరేంద్ర, సుజాత, మహబూబ్ పాల్గొన్నారు.

నులిపురుగుల మందు విధిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర, డాక్టర్ నాగార్జున

కొండపి: రెండేళ్ల పైబడిన ప్రతిఒక్క విద్యార్థి నులి పురుగు నివారణ మాత్రలు తీసుకోవాలని టీబీ సెల్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. డాక్టర్ నాగార్జున, పెట్లూరు సీహెచ్‌ఓ సీహెచ్ శ్రీనివాసరావు, పి.అనంతలక్ష్మి డి.మణెమ్మ, ప్రధానోపాధ్యాయుడు వి. సూసన్నకుమార్, ఏఎన్‌ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

టంగుటూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో ఏర్పాట్లను అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, డాక్టర్ రవీంద్ర పరిశీలించారు. ఈ అనంతరం టి.నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్వీ సుధారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దిగజారిన పొగాకు కనిష్ట ధర

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ.140కి దిగజారింది. వేలానికి క్లస్టర్ పరిధిలోని ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 799 బేళ్లను తీసుకురాగా 658 బేళ్లను కొనుగోలు చేసి 141 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281, సరాసరి ధర రూ.229.76గా నమోదుంది. వేలంలో 26 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ 235.68 పలికింది. తుమాడు, జమ్ములపాలెం గ్రామాలకు చెందిన రైతులు 798 బేళ్లను వేలానికి తీసుకురాగా 658 బేళ్లను కొనుగోలు చేసి 140 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.140గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి.

నిర్లక్ష్యం..నిరుపయోగం..!

- నిరుపయోగంగా ఆరోగ్య ఉప కేంద్రం
- అన్ని వసతులతో నిర్మించిన ఉప కేంద్ర భవనం
- ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
- అధికారులు పట్టించుకోక స్వల్ప మరమ్మతులు
- పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కందుకూరు రూరల్:

గ్రామ సచివాలయాల వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత సచివాలయాలతో పాటు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను నిర్మించారు. అయితే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లో ఇంత ముందే ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు ఉన్నాయి. అందులో మండలంలోని పలుకూరు పంచాయతీ ఒకటి. ఆరోగ్య ఉప కేంద్రం భవనం నిర్మించి ఉంది. ఈ భవనం అన్ని వసతులతో నిర్మించారు. ఇలా ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు ఉన్న పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు మంజూరు కాలేదు. ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఉపయోగించుకోవాల్సి ఉంది. ఏదైనా మరమ్మతులు ఉంటే బాగు చేయించుకొని వినియోగించాల్సి ఉంది. కానీ ఆరోగ్య సిబ్బంది మాత్రం ఆ ఆరోగ్య ఉప కేంద్రం వైపు చూడడం లేదు. దీంతో అది నిరుపయోగంగా మారింది.

అలా వదిలేశారు అంతే..

పలుకూరు పంచాయతీలోని సచివాయాలకు దగ్గరలో మెయిర్ రోడ్డు పక్కనే ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు కూడా చేరలేదు. కేవలం దానిని ఉపయోగించుకోకపోవడంతో చుట్టూ పిచ్చి మొక్కలు చెట్లు పెరిగిపోయాయి. ఈ కేంద్రానికి ఇరువైపులా గృహాలు ఉన్నాయి. కానీ ఉప కేంద్ర భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావడంతో వైద్యాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వీలేజ్ హెల్త్ క్లీనిక్ కింద ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కింద పంటవారిపాలెం, పత్తిపాటివారిపాలెం, రెడ్డిపాలెం, ఉన్నంవారిపాలెం, వెంకన్నపాలెం, రామనాథపురం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 7 వేల మంది జనాభా ఉన్నారు. సచివాలయ ఏఎన్‌ఎం, సబ్ సెంటర్ ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌సీతో కలిపి మొత్తం ముగ్గురు ఆరోగ్య సిబ్బంది పని చేస్తున్నారు. వీరంతా పంచాయతీ కార్యాలయాన్ని నూతన సచివాలయంలోకి మార్చడంతో పాత పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులోనే రోగులను పరీక్షిస్తున్నారు.


ఈ భవంలో అరకొర వసతులతో ఆరోగ్య సిబ్బంది ఉంటున్నారు. అయితే ఇక్కడ రెండో ఏఎన్‌ఎంగా ఉన్న పోస్టులను ఇక్కడ విధులు నిర్వహించకుండా మాచవరం పీహెచ్‌సీలో అదనపు పనులకు ఉపయోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలో వైద్య సిబ్బందిని ఇతర పనులకు ఉపయోగించుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

మరమ్మతులు చేస్తే ఉపయోగంలోకి...

ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి చిన్న చిన్న మరమ్మతులు చేయించుకుంటే ఉపయోగంలోకి వస్తుంది. కానీ వైద్యాధికారులు ఆ భవనాన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. భవనం బాగానే ఉన్నా ఆరోగ్య సిబ్బంది ఉపయోగించకపోవడం వల్లే అలా తయారైందంటున్నారు. చుట్టూ చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి భవనానికి చిన్న చిన్న మరమ్మతులు చేయించుకుంటే భవనం ఉపయోగంలోకి వస్తుంది. భవనంలో నీటితో సహా అన్ని వసతులు ఉన్నాయి. వైద్యాధికారులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న విలేజ్ హెల్త్ క్లీనిక్‌కు వెనుక వైపు గ్రామంలో వచ్చిన ప్లాస్టిక్‌ను పారిశుధ్య సిబ్బంది నిల్వ చేసి ఉన్నారు. ప్లాస్టిక్ ఎప్పటికప్పుడు బయటకు తరలించాలి. కానీ అక్కడే పడేయడం వల్ల దోమలకు అవాస కేంద్రాలుగా మారుతాయి. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగులకు కొత్త రోగాలు వచ్చేలా ఉంది ఆ పరిసర ప్రాంతం. ఎక్కువ మొత్తంలో వాడిపడేసిన ప్లాస్టిక్ డబ్బాలు ఉన్నాయి. వీటిని కూడా తీసి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రస్తుతం ఆరోగ్య సిబ్బంది ఉంటున్న పాత పంచాయతీ కార్యాలయం



నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం



పంచాయతీ కార్యాలయం వెనుక వైపున నిల్వ చేసిన ప్లాస్టిక్

వైభవంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజలు అందుకున్న గంగమ్మతల్లి

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఆలయంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట నిర్వహించి ఆలయం వెలుపల వినాయకుడు, పోతురాజు, వీరభద్రస్వాములు విగ్రహాలను ప్రతిష్టించారు. ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మూడు రోజుల పాటు గంగమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

గ్రీవెన్స్ సెల్‌కు మూడు అర్జీలు



గ్రీవెన్స్‌సెల్‌కు హాజరైన అధికారులు

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ నయిం అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు మూడు అర్జీలు వచ్చాయి. పొలం ఆన్‌లైన్ చేయాలని చుండి, నలదలపూరు, అయ్యవారిపల్లి గ్రామాల నుంచి అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్

పీసీపల్లి: అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. మండల పరిధిలోని వెంగళాపురం, నేరేడుపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను చంద్రబాబు నిలువునా మోసం చేశాడన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి అక్క చెల్లెమ్మలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో కులం, మత,, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. రెడ్‌బుక్ పేరుతో వేధిస్తూ, అక్రమ కేసులు బనాయించడం తప్ప చేసింది శూన్యమన్నారు. హామీలు ఎప్పుడూ అమలు చేస్తారంటూ కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంత మేర లబ్ధి పొందారు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో ఎంత నష్టపోయారో గుర్తించాలని కోరారు. అనంతరం స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసం గురించి వివరించారు. ఒక్కో కుటుంబం చంద్రబాబు హామీలు అమలుకాకపోవడంతో ఎంత మేర నష్టపోయిందని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీకాంత ఓకే రెడ్డి, మండల అధ్యక్షుడు గోపవరపు బొర్రారెడ్డి, బత్తుల అంజయ్య, పిచ్చిరెడ్డి, ఎర్రంరెడ్డి మోహన్ రెడ్డి, గుజ్జుల బాల నర్సారెడ్డి, బోడే కొండారెడ్డి, పెరికల వెంకటేశ్వర్లు, రేగుల బాలయ్య చౌదరి, పరిమి వెంకటరావు చౌదరి, పాదిలి చెన్నకేశవులు, ఉండేల వెంగలరెడ్డి, మేకల మాల్యాద్రి యాదవ్, పరుచూరి రమేష్ గౌడ్, మూలె రాజశేఖర్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, నల్లగంగుల శ్రీనివాస్ యాదవ్, షేక్ నజీర్ బాష, రేకుల సుధాకర్ చౌదరి, వెన్నం దివ్య, అత్యల ఇషాక్, మూల నారాయణ రెడ్డి, తోడేటి నాగేశ్వరరావు, సూరా మాల్యాద్రి రెడ్డి, మైల కొండయ్య, గుత్తికుంట నాగేశ్వరరెడ్డి, ఆంద్ర వెంకట్రావు, లింగాలదిన్నె నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న దద్దాల, ఇతర నేతలు

భూ సేకరణ నిలుపుదల చేయాలి

ఉలవపాడు: మండలంలో 30 యాక్టు ఎత్తివేసి ప్రజాభిప్రాయం మేరకు ఇండోసోల్ కరేడు గ్రామం నుంచి వెనక్కి వెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. అజయ్‌కుమార్ అన్నారు. ఉలవపాడులోని మీర్ మెమోరియల్ స్కూల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 4న కరేడులో జరిగిన గ్రామసభలో రైతులు, రైతు కూలీలు, గ్రామస్తులంతా ముక్త కంఠంతో ఇండోసోల్‌కు భూములు ఇవ్వమని తెలియచేశారు. ఈ తీర్మానం ఏమైందని ప్రశ్నించారు. 30 యాక్టు పెట్టి కరేడులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి ఆందోళనలు నిర్వహించకుండా నిర్బంధం ప్రయోగించిందన్నారు. దొంగచాటున సర్వే పేరుతో రామకృష్ణాపురం, పాట్టినుగుంట, ఉప్పరపాలెం గ్రామాల్లో డాక్యుమెంట్లను తీసుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేసి కేసులు పెడుతున్నారన్నారు. ఈ నెల 16,19 తేదీల్లో గ్రామసభలు నిర్వహించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. గ్రామసభలో అందరూ ఏకగ్రీవ తీర్మానం ఇచ్చిన తరువాత మరలా పెట్టడం సరైనది కాదన్నారు. రానున్న కాలంలో ఇళ్లను ఖాళీ చేయం-భూములు ఇవ్వం అనే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం ఉలవపాడు కార్యదర్శి జీవీబీ కుమార్, జి.వెంకటేశ్వర్లు, వీసం విజయ్, శాఖా కార్యదర్శి కత్తి సుజాత, పోట్లూరి రవి, లలితమ్మ, సుభాషిణి, కొండయ్య, అనిల్‌కుమార్, నాగమ్మ, నాగేంద్రరావు, అంకమ్మరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు

కందుకూరు: నెల్లూరులో ఈనెల 17, 18, 19వ తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు కోరారు. స్థానిక కోటారెడ్డిభవన్‌లో సోమవారం జరిగిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మహాసభల అనంతరం ఒంగోలులో ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలకు కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో శ్రేణులు తరలిరావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టేలా ఈ మహాసభలు జరుగుతాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు తమ ఓటు విలువ తెలుసుకొని ఓట్లు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మహాసభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు ఆనందమోహన్, కె.మరళి, సీహెచ్ దుర్గాప్రసాద్, బొజ్జ చంద్రమోహన్, నర్సయ్య, కౌన్సిల్ సభ్యులు ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, కె.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ హిమవంశీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ హిమవంశీ

కందుకూరు: కందుకూరు రెవెన్యూ డివిజన్ నూతన సబ్‌కలెక్టర్‌గా దామెరా హిమవంశీ సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన హిమవంశీ 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన మొదటి పోస్టింగ్‌గా కందుకూరు సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. అలాగే అధికారులు కూడా బాధ్యతయుతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా కార్యాలయంలో తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. ఐఏఎస్ అధికారిగా మొదటి పోస్టింగ్‌లో కందుకూరు రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన తిరుమాణి శ్రీపూజను ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆమె సోమవారం రిలీవై వెళ్లారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న చాంద్‌బాషా

పామూరు: మండల కేంద్రమైన కరెంట్‌ఆఫీస్ కాలనీకి చెందిన షేక్.సద్దాం గత కొంతకాలంగా కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా సోమవారం బాధితుడు సద్దాం నివాసానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్ బాషా, ఎంపీటీసీ సభ్యుడు షేక్.అబ్దుల్‌లు రు.10 వేలు, మైనారిటీసెల్ నాయకులు షేక్.ఖాదర్‌బాషా, షేక్.రేష్మ దంపతులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధితునికి అందజేశారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ మాజీ వలంటీర్ ఫాతిమా ఇచ్చిన సమాచారంతో బాధితునికి నగదు సాయం చేసినట్లు వారు తెలిపారు. కోఆప్షన్ సభ్యులు షేక్.నాయబ్‌రసూల్, షేక్.కాలేషా, షేక్.ఖలీల్ పలువురు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

సీఎస్‌పురం(పామూరు): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం సమాచారహక్కు 2005పై మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు, వెలుగు, ఉపాధి సిబ్బంది, ఎంపీటీసీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం పొందే విధానం, సమాచారం ఏవిధంగా దరఖాస్తుదారులకు ఇవ్వాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ హుస్సేన్, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఏపీఎం, ఏపీఓ, పీఎస్‌లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో నేల సారవంతం



పీసీపల్లి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగకృష్ణ



మర్రిపూడి: ప్రకృతి వ్యవసాయంపై రైతులతో మాట్లాడుతున్న ఏఓ వెంకటేష్

పీసీపల్లి: సేంద్రీయ ఎరువులతో నేల సారమతమవుతుందని ఏఓ రంగకృష్ణ అన్నారు. ఆత్మ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గుదేవారిపాలెంలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువ మోతాదులో వాడితే నేల సారవంతం దెబ్బతింటుందన్నారు. చవటి నేలలను జిప్సం ఉపయోగించి సాగు చేసుకోవచ్చని వివరించారు. రాయితీ కిట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మర్రిపూడి: సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేశ్ అన్నారు. మండలంలోని గుండ్లసముద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి వ్యవసాయం చేయడం వల్ల నేల, ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. మండలంలోని రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని సూచించారు. పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కషాయాల ద్వార నివారణ చర్యలు, వాటి ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. మండల యూనిట్ ఇన్‌చార్జి వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ప్యాకేజీ పెంచాలని వినతి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉప్పలపాలెం గ్రామస్తులు

ఉలవపాడు: భూములు, ఇళ్లు కోల్పోతున్న తమకు ప్యాకేజీని పెంచాలని కరేడు పంచాయితీ ఉప్పరపాలెం గ్రామస్తులు భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉప్పరపాలెం గ్రామస్తులు ఆయన్ను కలిశారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ గ్రామస్తులతో మాట్లాడి ప్యాకేజీ వివరాలు తెలియచేశారు. కానీ ఆ ప్యాకేజీ చాలా తక్కువగా ఉందని, ఆ ప్యాకేజీతో ఇళ్లు, భూములు ఖాళీ చేసి వెళ్లాలంటే తీవ్రంగా నష్టపోతామని తెలియచేశారు. ప్రభుత్వం ప్యాకేజీని పెంచి ఇస్తేనే తాము ఇళ్లు వదిలి వెళ్తామని, లేకుంటే వెళ్లమని తెలియచేశారు. గ్రామస్తులు ఇచ్చిన అర్జీని ఆయన తీసుకుని ఉన్నతాధికారులకు తెలియచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పరపాలెం గ్రామస్తులు ఉన్నారు.